క్లుప్తంగా

అమ్మనబ్రోలు రైల్వే స్టేషన్‌కు బస్సు సౌకర్యం

అద్దంకి: అద్దంకి పరిసర గ్రామాల నుంచి అమ్మనబ్రోలు వెళ్లే ప్రయాణికులకు డిపో నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ రామమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు అమ్మనబ్రోలు రైల్వే స్టేషన్ నుంచి నాగులుప్పలపాడు, బీ నిడమానూరు మీదుగా అద్దంకి వరకు ఉదయం 7.45 గంటలకు నడుపనున్నట్లు ఆయన తెలిపారు. బస్సు సర్వీసును ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

బాలుర వసతి గృహం పరిశీలన



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వేటపాలెం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ దర్శిని కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎంపీడీవో రూతమ్మ పేర్కొన్నారు. గురువారం మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామదర్శిని కార్యక్రమంలో పాల్గొన్నారు. వసతి గృహాల నిర్వహణ, భోజనం వంటి వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ పి విభీషన్, ఏఓ ఐ కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి



మధ్యాహ్న భోజనం చేస్తున్న తహశీల్దార్

అద్దంకి రూరల్: గ్రామదర్శినిలో భాగంగా తహశీల్దార్ జీవీ సుబ్బారెడ్డి గురువారం మండలంలోని కొటికలపూడి గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం నాడు-నేడు పనులు సంబంధించి పాఠశాలలో చేసిన అభివృద్ధిని పరిశీలించారు. మౌలిక వసతులు, విద్యార్థులను పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో గంగాధర్, పంచాయతీ సెక్రటరీ, సీఆర్పీలు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్రలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చీరాల అర్బన్: పట్టణాన్ని పారిశ్రామికవంతం చేయాలని, పట్టణంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతూ శుక్ర, శని వారాలు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్.బాబూరావు అన్నారు. గురువారం పేరాలలోని సీఐటియూ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పలువురు సీపీఎం నాయకులు మాట్లాడారు. పట్టణంలో డ్రైనేజీ సమస్య అపరిష్కృతంగా ఉందన్నారు. డ్రైన్లు ఆధునికీకరించి కుందేరుకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కుందేరు మిగులు భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన వారందరికి రేషన్ కార్డులు, లింకు రోడ్లు అభివృద్ధి చేయాలన్నారు. ఈనెల 8న చీరాల గడియార స్తంభం సెంటర్‌లో జరిగే బహిరంగ సభకు అందరూ హాజరుకావాలన్నారు.

బొల్లాపల్లిలో నేత్రదానం

ఇంకొల్లు (చినగంజాం): మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన వల్లేటి బుల్లయ్య (80) గురువారం చనిపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేసినట్లు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు తెలిపారు. మృతుని భార్య లక్ష్మీకాంతమ్మ, కుమారులు హనుమంతరావు, నాగమల్లేశ్వరరావు, ప్రసాద్, కుమార్తె శాంతకుమారిలు వారి నేత్రాలను తమ అంగీకారం మేరకు దానం చేయడంతో శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు సేకరించినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

మార్టూరు: బాలిక అదృశ్యమైన విషయమై పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం కేసు నమోదు అయింది. ఏఎస్సై సైదా వివరాల మేరకు.. మార్టూరుకు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ కుమార్తె ఈ నెల ఒకటో తేదీ బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుమార్తె ఆచూకీ కోసం ప్రయత్నించాడు. ఇస్మాయిల్ ఆమె ఆచూకీ తెలియకపోవడంతో గురువారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు తన కుమార్తె అదృశ్యం వెనుక స్థానిక క్వారీ కుంటలకు చెందిన షేక్ రబ్బాని అనే యువకుడి పాత్ర ఉన్నట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైదా తెలిపారు.

గ్రామదర్శినితో సమస్యలకు సత్వర పరిష్కారం

- గ్రామాలను పరిశీలించిన అధికారులు
- పలు సమస్యల గుర్తింపు



చింతగుంపలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో విజయమ్మ



పర్చూరు: పంచాయతీలో నిర్వహిస్తున్న పనులను పరిశీలిస్తున్న అధికారులు



ఈపురుపాలెంలో గ్రామదర్శిని పరిశీలిస్తున్న అధికారులు

చినగంజాం/కారంచేడు/మార్టూరు/యద్దనపూడి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామదర్శిని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని డీఎం అండ్ హెచ్‌ఓ ఎస్ విజయమ్మ అన్నారు. గ్రామ దర్శిని కార్యక్రమంలో భాగంగా గ్రామ దర్శిని ప్రత్యేకాధికారిగా ఆమె గురువారం మండలంలోని చింతగుంపల గ్రామాన్ని ఎంపీడీఓ కే స్వరూపరాణి ఆధ్వర్యంలో సందర్శించారు. ఇందులో భాగంగా ఆమె ప్రాథమిక పాఠశాలను, అంగన్ వాడీ కేంద్రాలను. గ్రామంలోని అంతర్గత రోడ్లను సందర్శించి పరిశీలించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆవె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంతరావూరు వైద్యాధికారి కీర్తి సరోజ్,కార్యదర్శి అనూష, కృపారావు, పాదిలి రాఘవ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వదన పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలను సకాలంలో అందించమే లక్షంగా ప్రభుత్వం గ్రామదర్శిని కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్ అరుణకుమారి అన్నారు. ఆమె మండలంలోని స్వర్ణ గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం ద్వార ప్రగతిని సమీక్షించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, నిర్మాణంలో ఉన్న హౌసింగ్ కాలనీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, వెల్‌నెస్ సెంటర్ల పనితీరు, నాడు-నేడు ద్వార ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయం వంటి ఆరు అంశాలతో ఉన్న ఫార్మాట్‌ను వారు పరిశీలించి నివేదికను తయారు చేశారు. మండలంలోని ఆదిపూడి గ్రామంలో బాపట్ల డీసీఏఓ యలమందారావు గ్రామదర్శిని పర్యవేక్షించారు. మండలంలోని దగ్గుబాడు గ్రామంలో పంచాయితీరాజ్ ఎస్ఈ హరేరామకృష్ణ గ్రామదర్శిని నిర్వహించి నివేదికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, పైమూడు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది గ్రామ సర్పంచ్ మోటాని మధుసూదనరావు, పీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నీరుకట్టు రామారావు, కాంప్లెక్స్ చైర్మన్ ఎంపీ సుబ్బారావులు పాల్గొన్నారు.



వింజనంపాడులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీ మైక్రో ఇరిగేషన్ రమణ

యద్దనపూడి మండలంలోని వింజనంపాడు గ్రామంలో ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ బీవీ రమణ, పోలూరు గ్రామంలో డీఈవో పీవీజే రామారావు ఆయా గ్రామాల్లో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలను, ఆసుపత్రి, సచివాలయం, రైతుభరోసా కేంద్రం పాఠశాలను, గృహనిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణకుమారి, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు మండలంలోని ఇసుకదరిశి, కోనంకి గ్రామాల్లో జిల్లా రిజిస్ట్రార్ జీ లక్ష్మి, ఈఓఆర్డీ సురేష్ స్థానిక అధికారులతో కలిసి ఇసుకదరిశి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు నేడు పథకం ద్వారా నిర్మాణం జరుగుతున్న తరగతి గదులను పరిశీలించారు. కోనంకి గ్రామంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వెంకటేశ్వర్లు ఎంపీడీఓ జీ నితిన్, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణతో కలిసి పలు పథకాలను పరిశీలించారు. జగనన్న లే అవుట్‌లోని వీధి లైట్లు, నీటి మోటారు సమస్యలను సర్పంచ్ జొన్నలగడ్డ రేణుకాదేవి అధికారుల దృష్టికి తీసుకురాగా వారు తక్షణమే పరిష్కరించారు.

గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా పర్చూరు మండలంలోని గ్రామాల్లో పలువురు ప్రత్యేకాధికారులు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. మండలంలోని ఏదుబాడు, నూతలపాడు, తూర్పుపెద్దివారిపాలెం, రమణాయపాలెం, అడుసుమల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామ దర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏదుబాడు గ్రామ పంచాయతీకీ నిజాంపట్నం ఫిషరీస్ ఏడీ బీ సైదా, నూతలపాడు గ్రామ పంచాయతీకీ అద్దంకి సబ్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏ శ్రీనివాసులు, తూర్పు పెద్దివారిపాలెం పంచాయతీకి జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి కే రమేష్‌బాబు, రమణాయపాలెం గ్రామ పంచాయతీకీ బాపట్ల సబ్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కే శ్రీనివాసరావు, అడుసుమల్లి గ్రామ పంచాయతికీ రేపల్లె డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఏవీఎల్ ప్రసాద్‌లు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీ ప్రద్యుమ్నకుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు,

గ్రామాలను పరిశీలించిన అధికారులు..

మేదరమెట్ల: గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని తమ్మవరం, కొరిశపాడు, మేదరమెట్ల గ్రామాల్లో అధికారులు గ్రామాల్లోని అభివృద్ధి పనులను పరిశీలించారు. మేదరమెట్ల పంచాయతీలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, ఎంపీడీవో సురేష్‌బాబు జెడ్పీహెచ్‌ఎస్‌ను పరిశీలించారు. కొరిశపాడు గ్రామ పంచాయతీని రేపల్లె పీఆర్ డీఈఈ ఎంఎస్ఎస్ ప్రసాద్ పరిశీలించారు. తాగునీటి కార్యక్రమం అమలు, పారిశుధ్యం, నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలించారు. తమ్మవరం గ్రామ పంచాయతీని డీఈఈ ఎన్ రంజన్‌బాబు పరిశీలించారు. స్థానిక యర్రం చినపోలిరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి అందులో రోగులకు అందచేస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

గ్రామదర్శినిపై అధికారుల సమీక్ష..

చీరాల టౌన్: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని దేవాంగపురి, దేవినూతల, ఈపురుపాలెం గ్రామాల్లో అధికారులు గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో కే నేతాజీ తెలిపారు. పైమూడు గ్రామాల్లో ఉన్నతాధికారులు అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలు, హౌసింగ్, స్కూల్స్, హెల్త్ సెంటర్లు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ అమలు తీరును పరిశీలించారు.దేవాంగపురిలో చీరాల ఆర్‌డీఓ సరోజినీ, దేవినూతల గ్రామంలో జిల్లా పరిషత్ సీఈఓ, బాపట్ల ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజనీర్లు పర్యవేక్షించి తగు సమాచారం సేకరించారు.



స్వర్ణలో అంగన్‌వాడీ కేంద్రం పనితీరును పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి



ఇసుక దరిశలో సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా రిజిస్ట్రార్ లక్ష్మి



మేదరమెట్ల పీహెచ్‌సీలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

పరస్పర సమన్వయంతో మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఏఓ కిరణ్‌కుమార్, ఎంపీపీ, ఎంపీడీఓ

మార్టూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో మండలాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకుందామని ఎంపీపీ భూక్యా శాంతిబాయి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వచ్చారు. కోలలపూడి సర్పంచ్ సతీష్ కుమార్ శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను మార్చి నేల జారిన విద్యుత్ తీగలను సరి చేయాలని, చిలకలూరిపేట నుంచి కోలలపూడికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరారు. వీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకోసం శనగలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, సాంకేతిక కారణాల వలన పీఎం కిసాన్ పథకం మంజూరు కాని రైతులు రెండు రోజులలో సరి చేయించుకోవాలని కోరారు. ఉద్యాన వన శాఖాధికారి హనుమంత నాయక్ మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ ద్వారా అందించేందుకు తైవాన్ స్ప్రేయర్‌లు, మిని ట్రాక్టర్‌లు సిద్ధంగా ఉన్నాయని కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీ నితిన్, మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతారామయ్యకు సన్మానం



సీతారామయ్యను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

చినగంజాం: ఫొటోగ్రఫీలో రాష్ట్రస్థాయిలో అవార్డు సాధించిన రావి సీతారామయ్యను చినగంజాంకు చెందిన సత్యం హైస్కూల్ పాఠశాల యాజమాన్యం గురువారం ఘనంగా సన్మానించింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సీతారామయ్యను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నున్నా హరినాథ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి ఎదిగి రాష్ట్ర స్థాయిలో సీతారామయ్య ఫొటోగ్రఫీలో అవార్డు సాధించడం గొప్ప విషయం అని రాష్ట్ర స్థాయిలో చినగంజాం గ్రామానికి పేరు తీసుకొని వచ్చాడని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం ఆశ్వీజ మాసం పునర్వసు నక్షత్రం షష్టి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరినకోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నిత్యావసరాలు, పండ్లు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు ఆర్ఏసీ టెక్నీషియన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం సూర్యదివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లో దివ్యాంగులకు చేయూతగా నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేసారు. ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బాపూజీ శ్రీను మేస్త్రీ వర్ధంతిని పురస్కరించుకుని సూర్య దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లో శ్రీను కుమారుడు తిలక్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు చేయూతనిచ్చారు. కార్యక్రమంలో బాపూజీ శ్రీను, రాష్ట్ర ఆర్ఏసీ టెక్నీషియన్ యూనియన్ అధ్యక్షుడు మషద్ జానీ, ఒంగోలు యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ మీర్, రమీజ్, మున్నా, శిష్య బృందం పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

బల్లికురవ: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు శని, ఆదివారాలు మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలచే ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని తహశీల్దార్ కే.రవి బాబు గురువారం తెలిపారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా ముద్రిస్తారని డిసెంబర్ 9లోపు కొత్తగా ఓటరుగా నమోదు కావచ్చని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్యాంపెయిన్‌కు బీఎల్వోలు ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కోరారు. నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణలు తొలగింపులో భాగంగా శని వారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ వివరించారు.

క్విజ్ పోటీలో బూదవాడ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

జే.పంగులూరు: బాపట్లలోని ఏబీఎన్ పాఠశాలలో గురువారం జిల్లా స్థాయిలో ఎయిడ్స్ వ్యాధిపై అధికారులు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో జిల్లా నలుమూలల నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్న బూదవాడ విద్యార్థులు మంచి ప్రతిభను కనపరిచి ప్రథమ స్థానం సాధించారు. భవనం శివాని, షేక్ సమీరాను హెచ్ఎం బంగారుకొండ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో తెల్లదోమ నివారణ



వైరస్ నివారణ గురించి వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పర్చూరు (చినగంజాం): ప్రకృతి వ్యవసాయం ద్వారా మిరపలో తెల్లదోమ నివారణను సులభంగా తొలగించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సీహెచ్ అప్పారావు తెలియజేశారు. గురువారం నూతలపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతు చెంచు రామారావు మిరప పొలంలో పరిశీలించారు. రసం పీల్చేపురుగుల నివారణకు 1 ఎకరాకు 25 పసుపు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకొని, నీమాస్త్రం కషాయం 100 లీటర్ల నీటికి 5 కేజీలు వేపాకు 5 లీ ఆవు మూత్రం, 1 కేజీ ఆవుపేడ కలిపి 48 గంటలు మరగబెట్టాలి. తరువాత వడగట్టి సాయంత్రం పూట పిచికారీ చేసుకొనిన అన్ని రకాల రసం పీల్చే పురుగులు, తెల్లదోమను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మప్రచార వారోత్సవాలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

జే.పంగులూరు/అద్దంకి రూరల్: సింగరకొండ గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం నుంచి ధర్మ ప్రచారం వారోత్సవం రథం గురువారం ఉదయం పంగులూరు చేరుకుంది. కార్యనిర్వాహణ అధికారి తల్లాప్రగడ సుభద్ర స్వామి వారి దేవస్థానం నుంచి ప్రచార రథాన్ని జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. పంగులూరు గ్రామంలోని పవిత్ర పుణ్యక్షేత్రం అయిన భీమలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహించారు. ధర్మం గొప్పదనం, సంస్కృతి సంప్రదాయాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర కుమార్, కార్యనిర్వాహణాధికారి ఉప్పల మూర్తి శ్రీనివాసులు, ట్రస్టుబోర్డు చైర్మన్ బాచిన వెంకటేశ్వర్లు, జెడ్పీటీసి రాయిణి ప్రమీళ, ఉపసర్పంచ్ చిలుకూరి కోటేశ్వరమ్మ, సొసైటీ చైర్మన్ రావూరి రంగారావు, సింగరకొండ, పంగులూరు దేవస్థాన అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం పుణ్యప్రదం



అయ్యప్పలకు అన్నం వడ్డిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి/మేదరమెట్ల: మాలాధారులకు అన్నదానం చేయడం పుణ్యప్రదమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న మాలాధారులకు అన్నదానం కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రతి ఏటా మాలాధారులకు అన్నదానం చేయడం అంత సులభ విషయం కాదన్నారు. అయినా పట్టువిడవకుండా కార్యక్రమం కొనసాగించడంతో నిర్వాహకులను అభినందించారు. ఆయనకు అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాలాధారులు అయ్యప్ప, వివిధ మాలాధారులు తదితరులు పాల్గొన్నారు.

కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం పాత గుంటూరు రోడ్డులో గలగణపతి మురగస్ అయప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అయప్ప స్వాములకు ఉచిత అన్నదాన కార్యక్రమం కొనసాగింది. పామా వెంకటసుబ్బారావు, కామేశ్వరమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు వెంకటసుబ్బారావు కుటుంబ సభ్యులు అన్నదాన దాతలుగా వ్యవహరించారు. 254 మంది స్వాములు అన్నదానం చేసిన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎన్నికల నియమావళిని అనుసరించి విధులు



బూత్ స్థాయి అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

చినగంజాం: బూత్ స్థాయి అధికారులు ఎన్నికల నియమావళిని అనుసరించి తమ విధులను నిర్వహించాలని తహశీల్దార్ పీ పార్వతి సూచించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఓటర్లు నమోదు, తొలగింపు, సవరణలకు సంబంధించి అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. పూర్తి స్థాయిలో రుజువులు పెట్టుకొని నమోదు కార్యక్రమాలను నిర్వహించాలని, అదే విధంగా సిఫారసులకు లొంగి ఎలక్షన్ కమిషన్ నియమనిబంధనలను అతిక్రమించవద్దని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని బూత్‌లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం నుంచి జారిపడి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలిస్తున్న కూలీలు

అద్దంకి రూరల్: విద్యుత్ స్తంభంపై నుంచి జారిపడి కూలీకి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన గురువారం అద్దంకి మండలంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మద్దిపాడు మండలంలోని గాజులపాలెం గ్రామానికి చెందిన బొంత సుబ్రమణ్యం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే పనులు చేసేందుకు గురువారం తోటి కూలీలతో కలిసి అద్దంకి మండలంలోని వేలమూరిపాడు గ్రామం దగ్గరలో ఉన్న ధేనువుకొండ పునరావాస కాలనీకి వచ్చారు. ఈక్రమంలో పనులు చేస్తుండగా సుబ్రమణ్యంలో ప్రమాదవశాత్తు స్తంభంపై నుంచి జారి కింద పడ్డాడు. తీవ్రగాయాలవటంతో హుటాహుటిన తోటి కూలీలు ఆటో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.